హడావిడే తప్పా.. సాగునీరేది?

- మొక్కుబడిగానే నీటి విడుదల
- రెండు రోజులుగా నిలిచిపోయిన సరఫరా
- నిండని చెరువులు.. ఆందోళనలో రైతులు

కాల్వలో పూర్తి స్థాయిలో చేరని నీరు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16: వారంరోజులుగా మల్కపేట కాల్వలోకి నీరు వస్తుందని హడావిడి చేశారు. నాలుగురోజుల కితం మొక్కుబడిగా కాల్వలో నీరు వదిలారు. తీరా రెండురోజులుగా నీటి విడుదల నిలిచిపోయిందంటూ మల్కపేట కాల్వ పరీవాహక గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని కొత్త చెరువు, తిమ్మాపూర్‌లోని మైసమ్మ చెరువు నింపేదుకు కాల్వలోకి నీళ్లు వదిలినట్లు చెబుతున్నప్పటికీ ఈ గ్రామాల ఆఖరు పాయింట్ బాకుర్‌పల్లి వద్ద కాల్వలో నీరు లేకపోవడం రైతుల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రెస్‌మీట్‌కు సంబంధించిన ప్రకటనలో మైసమ్మ చెరువు వరకు కాల్వలో నీళ్లు వదిలామని చెప్పినప్పటికీ.. మైసమ్మ చెరువు కాల్వ వద్ద పూర్తి స్థాయిలో నీళ్లు లేకపోవడం కొసమెరుపు. తమ ఆవేదనను అర్థం చేసుకుని రెండు చెరువులు నింపాలని అధికారులు, నాయకులను కాల్వ పరీవాహక రైతులు వేడుకున్నారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 : పట్టణ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం వంకాయల కార్తీక్, కీసరి నాగరాజు పోటీ చేయగా, 56 ఓట్ల మెజార్టీతో కార్తీక్ విజయం సాధించాడు. ఉపాధ్యక్షుడిగా బొల్లోజు శ్రీనివాస్, ఎంబేరి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, సహాయ కార్యదర్శులుగా నరేశ్, పండుగ రాజు, కోశాధి కారిగా ఆనంద్, కార్యవర్గ సభ్యులుగా దేవయ్య, శ్రీనివాస్, అరుణ్‌చంద్ ఎన్నికయ్యారు.


గంభీరావుపేట/సిరిసిల్ల టౌన్ : నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పలుకరిస్తూ... ఆశీర్వదిస్తూ..

- జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన
- పలు శుభకార్యాలకు హాజరు
- నూతన వధూవరులకు ఆశీర్వాదం
- సెల్ఫీల కోసం పోటీపడ్డ అభిమానులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) /సిరిసిల్ల టౌన్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పలు వివాహ వేడుకలకు హాజరై అందరినీ ఆప్యాయంగా పలుకరించారు. రామన్నను చూసి అనేక మంది సెల్ఫీల కోసం పోటీపడ్డారు. పెళ్లి మండపంలో ఒక్కటైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. సిద్దిపేట నుంచి సిరిసిల్లకు సాయం త్రం నాలుగు గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ముందుగా లహరి ఫంక్షన్‌హాల్‌లో కళ్యాడపు సురేశ్ కూతురు సౌగంధిక-రాహుల్, బోనాల రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు దాసరి వీణ-వేణుగోపాల్ కొడుకు సాయికృష్ణ-శ్రావణి వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో లక్ష్మీమల్లారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నేత బెజగం రాంరెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరై.. నూతన వధూవరులు రమణారెడ్డి-సుష్మారెడ్డిని ఆశీర్వదించారు. అక్కడి నుంచి దుమాల రోడ్డులోని సాయి శివ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని, బండలింగంపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు తడుకల స్వామి-పద్మ దంపతుల కూతురు లహరిక-ప్రశాంత్‌రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలకు హాజరైన పార్టీ కార్యకర్తలను బాగున్నారా.. అంటూ ఆప్యాయంగా పలుకరించారు. తర్వాత పలువురు కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. గ్రామాల సమస్యలు, పార్టీ కార్యకలాపాలపై చర్చించారు. తర్వాత హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. కేటీఆర్ వెంట కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ జిందం కళ, నాయకుడు కుంబాల మల్లారెడ్డి, వర్స కృష్ణహరి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన కేటీఆర్‌తో సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారులు

మహిళలకు రక్షణ కవచం భరోసా సెంటర్

ఎస్పీ అఖిల్ మహాజన్

నిర్వాహకులతో ఎస్పీ అఖిల్ మహజన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): బాధిత మహిళలకు భరోసా సెంటర్ రక్షణ కవచంలా పనిచేస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బాలికలు, మహిళలకు వైద్యం, కౌన్సెలింగ్‌తో పాటు సేవలందించడంలో పోలీస్ శాఖ అండగా నిలుస్తుందన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, ఆపదకు లోనైన వారికి పోలీస్‌స్టేషన్లకు, దవాఖానలకు దూరంగా సురక్షితమైన వాతావారణంలో చేయూత అందించడానికి భరోసా సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హింసా, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలు మళ్లీ అటువంటి భారిన పడకుండా చూడడమే భరోసా సెంటర్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలు, బాలికలకు సంబంధించి కేసులు పోలీస్‌స్టేషన్‌లో నమోదైనప్పటి నుంచి బాధితులకు అండగా ఉంటుందన్నారు. బాధిత మహిళల మానసిక పరిస్థితిపై వివరంగా తెలుసుకుంటూ భరోసా కల్పిస్తున్న భరోసా సెంటర్లపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐలు కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఏవో పద్మ, ఎస్ఐ జ్యోతి, అశోక్, ప్రథ్వీదర్, అనంత పాల్గొన్నారు.

కేసీఆర్‌నగర్‌లో పహారా కాస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ కేసీఆర్ నగర్

- ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేపట్టిన అధికారులు
- పోలీసుల పహారాలో సర్వే నిర్వహణ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 16 : తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం ఆదివారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉదయాన్నే భారీగా పోలీసులు కేసీఆర్ నగర్‌లో మోహరించారు. ఏంజరుగుతుందో కాలనీ వాసులకు తెలియకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. తర్వాత రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులు చేరుకుని ఇంటింటా కుల గణన సర్వే నిర్వహించారు. ఎలాంటి సమాచారం లేకుండా సర్వే నిర్వహించడంతో దూర ప్రాంతాలు, బంధువుల ఇండ్లకు వెళ్లిన వారు అందుబాటులో లేక ఆందోళన చెందుతున్నారు. ఈ సర్వేలో ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 : మండలంలోని గాలిపెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలను నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ సింగారపు తిరుపతి, రాష్ట్ర కబడ్డీ జాయింట్ సెక్రటరీ సంపత్ రావు, కోశాధికారి దేవత ప్రభాకర్, పేట టీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ గౌడ్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బొడ్డు నారాయణ, ఇల్లంతకుంట మండల సెక్రటరీ మామిడి శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 : మండలంలోని గాలిపెల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. గ్రామానికి చెందిన తాటికొండ అనిల్ న్యూరో ఫిజీషియన్ సిద్దిపేట, కరీంనగర్‌లో సొంత దవాఖాన ఉన్నా సొంత గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేసేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో లక్ష మెడికల్ క్యాంపులో భాగంగా కొలస్ట్రాల్, షుగర్, పక్షవాతం, మూర్ఛ వ్యాధి తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ సెస్ డైరెక్టర్ రవీందర్, మాజీ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్యామల దేవి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మాధవ రెడ్డి, చంద్రారెడ్డి, అనంతరెడ్డి, దేవారెడ్డి పాల్గొన్నారు.

మసీద్ కమిటీ అధ్యక్షుడిగా షమీ

ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 : సిరిసిల్ల మసీద్ కమిటీ ఎన్నికలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. స్థానిక పెద్దబజార్‌లోని మసీద్ వద్ద గల కమిటీ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం ఓట్లు 772 ఉండగా, వాటిలో 682 ఓట్లు పోలవ్వగా వాటిలో 4 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల అధికారులు తెలిపారు. స యద్ సమీ (మౌలానా)కు 349 ఓట్లు రాగా ముస్తాఫాకు 329 ఓట్లు వచ్చాయి. 20 ఓట్ల తేడాతో సమీ విజయం సాధిం చినట్లు ప్రకటించారు. సమీని మసీద్ కమిటీ సభ్యులు, నాయకులు అభినం దనలు తెలిపారు.

ఘనంగా కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న కేటీఆర్ సేన నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు పుట్టిన రోజు వేడుకలు కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ కేటీఆర్ రాష్ట్ర సేన ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన ముస్తాబాద్ మండలాధ్యక్షుడు వంగూరి దిలీప్, ఎండీ జహంగీర్, కరెడ్ల మల్లారెడ్డి, కోడె శ్రీనివాస్, నరేంద్ర చారి, పోతారం సతీశ్, మనీశ్, వసంత్, శ్రావణ్‌కుమార్, శ్రీకాంత్, మహేశ్, వెంకటేశ్, అశోక్, దేవేందర్, రాజు, శ్రీనివాస్, ఆనంద్, వంశీ, లక్ష్మణ్, స్వామి, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలతో కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కాళేశ్వరం జలాలు మల్లన్నసాగర్ నుంచి మండలంలోని మద్దికుంట చెరువుకు చేరి మత్తడి దూకడంతో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి శీలం స్వామి నాయకులు కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మెట్ట ప్రాంతమైన ముస్తాబాద్ మండలానికి కాళేశ్వరం జలాలు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ముందు చూపుతో మండలాన్ని సస్యశ్యామలం చేసిన కేసీఆర్, కేటీఆర్‌కు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

హరితం.. అగ్నికి ఆహుతి!

మొక్కల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

కాలిపోయిన హరితహారం చెట్లు

చందుర్తి, ఫిబ్రవరి 16 : గత కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి విడుతల వారీగా అమలు చేస్తూ తీరొక్క మొక్కలు నాటింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో, పొలం గట్లపై నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది నిరంతరం నిరందించడంతో ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. పచ్చదనాన్ని సంతరించుకొని నీడనిస్తూ బాటసారులకు కనువిందు చేస్తున్నాయి. కానీ, ప్రస్తుత వేసవిలో వాటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో నీరందక ఎండిపోతున్నాయి. ఆదివారం లింగంపేట గ్రామంలోని వీరుని గడ్డ శివారు వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హరిత హారం మొక్కలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సుమారు 25 చెట్లు అగ్నికి ఆహుతై బూడిదయ్యాయి. దీంతో పొగ కమ్ముకపోవడంతో వచ్చీపోయే వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయి. సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతుందని, హరిత హారంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడే బాధ్యతను పంచాయతీ అధికారులు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఓసీ జనాభా పెరిగి..బీసీ జనాభా ఎలా తగ్గింది !

నిరసనలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

వేములవాడ, ఫిబ్రవరి 16 : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో ఓసీల జనాభా శాతం పెరిగి.. బీసీల జనాభా శాతం తగ్గడం పూర్తిగా అధికార పార్టీకి అనుకూలంగా సర్వే జరిగినట్లుగా ఉందని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య ఆరోపించారు. కులగణలో కాపుల సంఖ్య తక్కువగా చూపెట్టడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన నిరసన కార్యక్రమాల్లో ఆదివారం వేములవాడలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో మున్నూరు కాపులతో పాటుగా అన్ని బీసీ కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఉద్దేశపూర్వకంగానే సర్వేలో బీసీల జనాభా తగ్గించారన్నారు. పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు తూపుకారీ సత్తయ్య, మాజీ కౌన్సిలర్ మారం కుమార్, కొండా కనకయ్య, సీహెచ్ రామస్వామి గౌడ్, కూరగాయల మల్లేశం, కుంభం రవి, చేను హెలపతి, ఉయ్యాల భూమయ్య గౌడ్, కంశాని శ్రీధర్, చవాన్ అర్జున్, బొగ శ్రీధర్, ఎట్టం సాయి కృష్ణ, మిద్దె వినిత్ గౌడ్, ఎదుల నాగరాజు ఉన్నారు.

ముగ్గురిపై కేసు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 16: లింగంపల్లి మూలవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని, తప్పుడు వార్తలు పోస్టు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోషల్‌మీడియాలో ఇతర మనోభావాలు దెబ్బతినేలా, ప్రజలను తప్పుదోవ పట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగంపల్లిలో ఇసుక రీచ్‌కు తాత్కాలిక అవసరాల కోసం పర్మిషన్లు ఇచ్చినట్లు తెలిపారు. ట్రాక్టర్లు ఇసుకలోడ్ చేసే విషయంలో లేబర్లకు, ట్రాక్టర్ యజమానులకు కూలీ డబ్బుల విషయంలో వాగ్వావాదం జరిగి ఇసుక తీయకుండానే ట్రాక్టర్లు తిరిగి వెళ్లగా, దీనికి సంబంధించిన వీడియో తీసి కొందరు ఎలాంటి విషయాలను ధ్రువీకరించుకోకుండా, యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా అంటూ సోషల్ మీడియాలో వీడియోలను షేర్ చేశారన్నారు. ఈ విషయంలో తహసీల్దార్ సుజాత దృష్టికి రాగా, వీడియో తీసి వైరల్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీఐ ఫిర్యాదు చేశారు. దీంతో లింగంపల్లికి చెందిన మహేందర్, నరేశ్, హన్మాజీపేటకు చెందిన రాకేశ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తప్పుడు విషయాలను ఎవరి ఇష్టానికి వారు సోషల్‌మీడియాలో పోస్ట్ చేసినా, ఫార్వర్డ్ చేసినా వారితో పాటుగా ఆయా గ్రూప్‌ల అడ్మిన్‌పై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అనుమతులు పొందితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్

గంభీరావుపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని ముస్తాఫానగర్ పరిధి ట్రాన్స్‌ఫార్మర్‌కు 100 కేవీ కంటే ఎక్కువ లోడు పడుతున్నందున నూతన వ్యవసాయ కనెక్షన్ కోసం రైతులు డబ్బులు చెల్లించి, అనుమతులు పొందితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని సెస్ ఏఈ రుషిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం

- పత్తి కట్టె కుప్ప చేస్తున్న సమయంలో ఘటన
- రూ.4 లక్షల వరకు నష్టం
- బోరున విలపించిన రైతు కుటుంబం

కోనరావుపేట, ఫిబ్రవరి 16: మండలంలోని మంగళ్లపల్లిలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు నిప్పంటుకోగా కాలిపోయింది. బాధిత రైతు వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన రైతు ఉప్పల జీవన్ తన ట్రాక్టర్‌ను అదే గ్రామానికి చెందిన మరో రైతు సాసాల రాకేశ్ వ్యవసాయ క్షేత్రంలో పత్తికట్టె తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పత్తి కట్టెను ట్రాక్టర్‌కు ఉన్న గొర్రుతో కుప్ప చేస్తున్నాడు. అక్కడే అప్పటికే కుప్ప చేసిన పత్తి కట్టెను నిప్పటించి కాలుస్తుండగా, ట్రాక్టర్ కందంలోకి వెళ్లింది. దీంతో ఉన్నట్టుండి కందంలో ట్రాక్టర్ కూరుకుపోయి బయటకు రాలేదు. అక్కడే గాలికి వేగంగా మండుతున్న నిప్పు ఉన్నట్టుండి ట్రాక్టర్‌కు అంటుకుంది. సమయానికి అక్కడ చుట్టుపక్కల రైతులు, నీళ్లు లేకపోవడంతో ట్రాక్టర్ మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. ఈక్రమంలో కందకంలో కాలుతున్న ట్రాక్టర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. రైతుకు రూ.4లక్షల మేర నష్టం వాటిల్లగా, బాధిత రైతు కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

కుల గణన రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 : ప్రభుత్వం చేపడుతున్న కులగణన రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య డిమాండ్ చేశారు. రీ సర్వే జాబితాలో మున్నూరుకాపు జనాభా వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపుల కన్నా రెడ్డిలు ఎక్కువగా ఉన్నట్లైతే సదరు జాబితాను ప్రకటన చేయాలన్నారు. రీసర్వే నెల రోజులు సమయం కేటాయించి ఇంటింటికీ పంపి సర్వే చేయాలన్నారు. బీసీ కులగణనలో మున్నూరుకాపులకు అన్యాయం జరిగిందన్నారు. మున్నూరుకాపు రచ్చబండ కార్యక్రమం ద్వారా తాము చేస్తున్న డిమాండ్‌లు అన్నింటినీ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం పట్టణాధ్యక్షుడు ఒజ్జల అగ్గిరాములు, ఉపాధ్యక్షుడు కుల్ల సత్తయ్య, దుమాల రవి, సల్ల రవి, మారం కుమార్, ఎరుకల ప్రకాశ్, పల్లికొండ నర్సయ్య, దుమాల రాములు, పడిగెల రాజు, కొట్టె శ్రీనివాస్, లింగంపల్లి రాము పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకు కృషి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 : అల్మాస్‌పూర్ నుంచి బాకుర్‌పల్లి వరకు మల్కపేట కెనాల్ ద్వారా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం అల్మాస్‌పూర్‌లోని మల్కపేట కెనాల్‌ను సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. అల్మాస్‌పూర్ కెనాల్ నుంచి బాకుర్‌పల్లి వరకు 12 కిలోమీటర్ల వరకు కాల్వలో సాగునీరు అందించామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాబెరా బేగం ఉన్నారు.

మంద బాల్ రెడ్డిని సన్మానించిన కొండాపూర్ గ్రామస్తులు

బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్ ,ఫిబ్రవరి 16 : సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన కొండాపూర్‌కు చెందిన మంద బాల్ రెడ్డి ఎన్నికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బాల్‌రెడ్డి రెడ్డి సంఘం జిల్లా కార్యవర్గంలో చోటు రావడంతో గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్ క్యారం రాజు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వంతెన పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

వంతెన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

గంభీరావుపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగును ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన హైలెవల్ వంతెనను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి విక్రేతపై కేసు

వేములవాడ, ఫిబ్రవరి 16 (బోయినపల్లి) : బోయినపల్లి మండలంలోని జగ్గారావు పల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు వచ్చాడన్న సమాచారం మేరకు కొండవేని గంగాధర్‌ను తనిఖీ చేయగా, 64 గ్రాముల గంజాయి దొరకడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

110 గ్రాములు పట్టివేత

వీర్నపల్లి, ఫిబ్రవరి 16: గంజాయి తరలిస్తున్న నిందితులను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎల్లయ్యగౌడ్ తెలిపారు. మండల కేంద్రం శివారులో అదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా లాల్‌సింగ్ తండాకు చెందిన దినేశ్, అజ్మీరా పవన్, హరీశ్ గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకరి అరెస్ట్

రుద్రంగి, ఫిబ్రవరి 16 : చందుర్తి సర్కిల్ పరిధిలోని రుద్రంగి మండలంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర గ్రామానికి చెందిన పొత్తూర్తి రాకేశ్ రుద్రంగిలోని నేవూరిపల్లి బస్ స్టాండ్ వద్ద గంజాయి తరలిస్తుండగా, ఎస్ఐ అశోక్ సమాచారం మేరకు.. రాకేశ్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం తాగించి.. చితకబాది

కోనరావుపేట, ఫిబ్రవరి 16 : మద్యం తాగించి ఓ యువకుడిని చెట్టుకు కట్టిసి చితకబాదిన సంఘటన కోనరావుపేట మండలంలోని కొలనూర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ది రాజు, ఏనుగుల దేవరాజ్‌ను తన పొలం వద్దకు తీసుకువెళ్లి మద్యం తాగారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న పెద్దిరాజు అతడి భార్య, సోదరుడు కలిసి ఏనుగుల దేవరాజను చెట్టుకు కట్టిసి చితకబాదడంతో గాయాలయ్యాయి. తన తల్లి వచ్చి అంబులెన్స్‌లో సిరిసిల్ల దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

నిప్పంటుకున్న అడవి

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 : మండలంలోని బాబాయి చెరువుతండా శివారులోని అడవి ప్రమాదవశాత్తూ ఆదివారం నిప్పంటుకుంది. సుమారు 10 హెక్టార్ల ప్లాంటేషన్‌లో మంటలు వ్యాపించాయి. సిబ్బంది అగ్ని మాపక సిబ్బందికి సమాచార మివ్వగా వారు వచ్చి మంటలార్పారు.

పన్నుల వసూళ్లకు సహకరించాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నుల వసూళ్లకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీవో జోగం రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట వందశాతం పన్నులు వసూలు చేసి, మొదటి స్థానంలో నిలిచిందని, మిగతా గ్రామాల వాళ్లు కూడా రెండు నెలల గడువు ఉన్నందున వందశాతం